# రిటర్న్ జర్నీ

**కంపార్ట్‌మెంట్** అంతా నిద్ర పోతున్నారు. కానీ కళ్యాణికి ఎంత ప్రయత్నించినా కళ్ళు మూత పడటం లేదు.

"అమ్మమ్మా, చరిత్రలో నువ్వు మోస్ట్ అడ్వెంచరస్ అండ్ రెవల్యూషనరీ ఉమెన్‌గా మిగిలిపోతావు. విష్‌యు ఆల్ ది బెస్ట్ యిన్ యువర్ న్యూ లైఫ్'

సికిందరాబాద్‌లో రైలెక్కించి సాగనంపుతూ దీప్తి అన్న మాటలే ఆమెకు రైలు శబ్దంలో కూడా విన్పిస్తున్నాయి.

ఆయన ఉన్నంత కాలం తను మహారాణిలాగా బతికింది. కొడుకులు తనకి చెప్పకుండా వొక్క పని చేసేవారు కాదు. కోడళ్ళు మల్లెపూలు కొనుక్కోటానికి కూడా తన పర్మిషన్ తీసుకొనే వారు.

ఆయన పోయాక క్రమంగా తన కిరీటాన్ని లాగేసుకొన్నారు వాళ్ళు. సింహాసనాన్ని ఆక్రమించుకున్నారు.

ఏ విషయంలోనైనా అదేమని అంటే చాలు- కోడళ్ళు పెద్ద రగడ చేస్తారు. కొడుకులు భార్యల్ని వెనకేసుకొని వస్తారు.

వారి పిల్లలు తనని ఆట పట్టిస్తారు. వారి దృష్టిలో తనొక పని చెయ్యని పాత బొమ్మ రైలు-బస్సు-విమానం.

గుప్పెడు మెతుకుల కోసం అభిమానాన్ని చంపుకోవాలా తను?

కాపురానికొచ్చిన కొత్తల్లో అత్తగారి మీదనే తిరుగబాటు చేసింది తను. ఆడబిడ్డల నోళ్లు మూయించింది.

అలాంటి తను వ్యక్తిత్వాన్ని చంపుకొని కొడుకులకు, కోడళ్ళుకు లొంగి పడి వుండాలా?

నో, తను పోరాడుతుంది, గెలుస్తుంది.

రెండు చేతులు కలిస్తే చప్పట్లే-చప్పట్లు.

"అమ్మమ్మా, ఐ లైక్ యువర్ రెవల్యూషనరీ స్పిరిట్. అణగివుంటే మరింత అణగకొట్టారు ఎవరైనా. అంతిమ విజయం విప్లవానికే. కానీ యిలా మాటల పోరాటం వల్ల లాభం వుండదు. ఏక్షన్..........రెవెల్యూషనరీ ఏక్షన్ యీజ్ ది నీడ్ ఆఫ్ ది అవర్, తుపాకి గొట్టంలో నుంచే.........."

"నన్నేం చేయమంటావో చెప్పవే...."

తన మనవలు మనవరాళ్ళందరికీ తల్లిదండ్రుల బుద్ధులే వచ్చాయి. వొట్టి బూర్జువా పిల్లలు. వారిలో దీప్తి వొక్కతే తనకు వారసురాలు. విప్లవభావాలు, తిరుగుబాటుతత్వం వుంది.

"ఓకె. నువ్వు చేస్తానంటే ఎ.కె.తుపాకీ లాంటి ఐడియా చెప్తానమ్మమ్మా."

"చేస్తానన్నానుగా - చెప్పు" కచ్చగా అంది.

"చిన్నప్పుడు నువ్వు ఎవరినో ప్రేమించానన్నావుగా?"

"ఊహూ, నేను ప్రేమించలేదు. అతను నన్ను ప్రేమించాడు. లౌలెటర్సు రాసేడు. అతని పేరు తప్ప అతడిని గురించిన వివరాలు నాకేం తెలియవు. అతని పేరు జగన్.'

"యిప్పుడు ఆయన పేరు జగన్నాథం. విశాఖపట్నంలో వొంటరిగా వుంటున్నాడు. నేను ఆయనతో కరస్పాండెన్స్ చేసేను. హీ ఈజ్ రెడీ టు రిసీవ్ యూ అండ్ లివ్ విత్ యూ".

"ఛీ ఛీ......ఏమిటే నీ ఉద్దేశ్యం?"

"ట్రెడిషనల్ స్పిరిట్‌తో ఆలోచిస్తున్నావే అమ్మమ్మా......రెవల్యూషనరీగా ఆలోచించు, ఆయనకూ పెళ్ళయింది-భార్య చనిపోయింది-నీకు లాగా కొడుకులూ, కూతుళ్ళూ, మనవలూ, మనవరాళ్ళు వున్నారు. కానీ వారంతా ఎక్కడో వుంటున్నారు. ఆయనకూ తోడు కావాలి. నీకూ తోడుకావాలి. ఈ వయసులో స్త్రీ, పురుషుల మధ్య వుండేది సెక్స్ సంబంధం కాదు అమ్మమ్మా. ప్రేమబంధం. స్నేహ బంధం.....ఒక స్నేహితుడుగా ఆయన నిన్ను తన యింటికి ఆహ్వానిస్తున్నాడు. వెళ్తే తప్పేమిటి?"

మనవరాలి మాటలకు మెత్తబడింది తను.

అలా ఆరంభమయింది తన పయనం.

ఎప్పుడు లేచారో ఏమో, జనం హడావుడికి ఆమె ఆలోచనల్లో నుంచి బయటకొచ్చింది.

కంపార్టుమెంట్‌లో జనమంతా సామాన్లు తీసుకొని తోసుకొంటూ రైలు దిగుతున్నారు.

తీరా చూస్తే విశాఖపట్నం వచ్చేసింది.

ఆ కంపార్టుమెంటులో ఆఖరి వ్యక్తిగా కళ్యాణి రైలు దిగింది.

★ ★ ★

"మీరు కళ్యాణి. ఔనా? వెల్‌కమ్, హార్టీ వెల్‌కమ్-యింత సేపు కన్పించకపోతే రాలేదేమోనని భయపడ్డాను"

తెల్లగా, బొద్దుగా, గుమ్మటంలా వున్నాడు జగన్నాథం.

బోర్లించిన మూకుడులా నిగనిగ మెరుస్తున్న తలమీద నాలుగైదు వెంట్రుకలు తళతళ మంటున్నాయి. బ్లాక్‌ఫుల్ సూట్ వెనక కుండ లాంటి బొజ్జ అణగిమణగి వుంది.

ఆమెకు ఛటుక్కున తన భర్త రామ్మూర్తి గుర్తుకొచ్చాడు.

అతను నలుపు కిందే లెక్క. అయితే నేం? భారీ విగ్రహం-షష్టిపూర్తి నాటిక్కూడా తలపైన వొక్క వెంట్రుక నెరవలేదు. అతను ఫుల్‌సూట్ వేస్తే అదో ఠీవి. పంచె కడ్తే అదో అందం.

"రండి వెళ్దాం"

జగన్నాథం వెనుక ఆమె స్టేషన్ బయటికొచ్చింది.

పోర్టర్ సామానుల్ని కారులో పెట్టేడు.

"చిన్నపుడు మిమ్మల్ని ఆరాధించిన నన్ను మీరు గుర్తు పట్టలేదు. అవునా? ఎలా గుర్తు పట్టారు లేండి. అప్పుడు నేను సన్నగా రింగుల రింగుల క్రాపుతో అక్కినేనిలా వుండే వాడిని. మీకు గుర్తుందో లేదో? కాలేజిలో వొకసారి నాటకం వేస్తే అంతా అక్కినేననే నన్ను పొగిడేరు. చాలా మంది ఆడపిల్లలు నన్ను ఆరాధించారు. కానీ మీరే - నేనుగా ప్రేమ లేఖలు రాసినా జవాబన్నా యిచ్చారు కాదు!"

కారు యిల్లు చేరేదాకా అతనలా ఎప్పటి సంగతులో చెప్తూనే వున్నాడు. ఆమెకతను చెప్పిన వొక్క విషయం కూడా గుర్తులేదు.

కానీ కారు తోలుతూ అతను అలా మాట్లాడుతుంటే ఆమె గుండె గుబగుబలాడి పోయింది. వెధవ కాదు! కారు డ్రయివ్ చేస్తూ ఏక్సిడెంటయేకదూ రామ్మూర్తి చనిపోయాడు? తనప్పుడు కారులో వుంటే అలా జరిగేదా? రామ్మూర్తి స్పీడ్ డ్రయినింగ్‌కు తను బ్రేక్. ఆనాడు ఆ బ్రేక్ లేక పోబట్టే.......ప్చ్.........

"ప్లీజ్, తర్వాత మాట్లాడుకోవచ్చు-రోడ్డు వైపు చూస్తూ డ్రయిన్ చేయండి..."

"ఏం? భయమా? మీకు తెలీదేమో!నేను మూడుసార్లు కారు రేసుల్లో ఛాంపియన్ షిప్ గెల్చుకున్నాను..... ' అంటూ ఆ వివరాలు చెప్పుకు పోయాడు. చెప్తూనే కారు స్పీడ్ పెంచాడు. చాలా సార్లు హఠాత్తుగా బ్రేక్‌లు వేసేడు.

ఆ డ్రయివింగ్ ఆమెకే మాత్రం నచ్చలేదు. తను పక్క నుండి రామ్మూర్తి డ్రయివ్ చేస్తుంటే పుష్పకవిమానంలో తేలి పోతున్నట్లు ఎంత హాయిగా వుండేది!

కారు దిగేక ఆమె స్థిమిత పడింది.

"వెల్‌కమ్ టు మై హౌస్ మిసెస్ కళ్యాణీ" కారు డోర్ తెర్చి పట్టుకొని 'బో' చేస్తూ అన్నాడు జగన్నాథం.

ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో ఛాపియర్స్ గుర్తుకొచ్చారామెకు.

"వారం రోజుల క్రితం వరకు ఈ ఇంట్లో నాకు తోడుగా, వంట చేసి పెట్టడానికి వొక కుక్, పై పనులు చూడడానికి వో సర్వెంట్ వుండేవారు. కారణాలేమైతేనేం, నాలుగు రోజుల క్రితం సర్వెంట్, నిన్ననే కుక్ మానేసేరు. ప్రస్తుతం నేనే ఈ యింటి కుక్‌ని, సర్వెంట్‌ని" అన్నాడు ఫ్లాస్క్‌లో కాఫీ కప్పులో పోసి ఆమెకు అందిస్తూ.

ఆమె ఉలిక్కి పడింది!

సరిగ్గా తను యింట్లో అడుగు పెట్టే వేళకే యిద్దరూ మానేయాలా? అంటే - సర్వెంటు కూడా లేకుండా తామిద్దరమూ ఈ యింట్లో వుండాలన్నమాట!-

ఇల్లు చిన్నదైనా కాస్ట్‌లీగానే కట్టేరు. కానీ మైన్‌టెనెన్స్ బొత్తిగా పూర్. యిల్లంతా కంగాళీగా వుంది. యింటికి నాలుగు వైపులా బోలెడంత ఖాళీ స్థలం.

అంతటి స్థలం వుంటే రామ్మూర్తి స్వయంగా గార్డెన్‌ను పెంచకపోయాడా? యిల్లు అలా వుంటే అతనొక్క క్షణం సహించేవాడా? అతనికి ఎక్కడి వస్తువులు అక్కడే నిర్దిష్ట స్థానాల్లో వుండాలి. అలా 'నీట్'గా స్వయంగా సర్దేవాడు.

ఆ కళాత్మక దృష్టి యిక్కడ కలికేనికిక్కూడా కనబడదేం?

"యిల్లంతా చిందరవందరగా యిలాగ వుందేమా అని అనుకొంటున్నారా? ఏం చేయను చెప్పండి? మొదటి నుంచి యింటి మెయిన్‌టెనెన్స్ అంతా ఈ యింటి యజమానురాలే చూసుకొనేది. నా అలవాట్లు అభిరుచులు వేరు. అయాం ఎ మేన్ ఆఫ్ మెనీ ఏవొకేషన్స్ ఔట్ సైడ్ ది హౌస్. యింటి యిల్లాలులా పని మనుషులు యింటి నెలా మెయిన్‌టైన్ చేయగలుగుతారు చెప్పండి? పైగా ఈ నాల్గు రోజులుగా సర్వెంటు కూడా లేదు కదా? అంచేత యిలాగుంది. యింకెంతలేండి? రెండు రోజుల్లో సర్వెంట్, కుక్ కూడా కొత్త వాళ్ళే రావచ్చు. యిదిగో-పేపర్లో అడ్వర్‌టైజ్ చేసేను కూడా"

అది సరే. అప్పటి వరకు తిండి ఎవరు వండాలి? యిల్లెవరు శుభ్రం చేయాలి?

"మీరేం మాట్లాడటం లేదు. యింకా కొత్త పోలేదనుకొంటా. నన్నింకా మీరు పరాయివాడుగానే చూస్తున్నారు. ఈ యిల్లు మీదే ననుకోవాలి. వుయ్ ఆర్ నాట్ స్ట్రేంజర్స్, ఉయ్ ఆర్ ఓల్డ్ ఫ్రెండ్స్. ఈ యింట్లో మూడు బెడ్ రూమ్‌లున్నాయి. ఇది నా బెడ్‌రూం. మీరు ఏ రూంలోనన్నా వుండవచ్చు. ఎక్కడో చోట సెటిల్ అయి స్నానం ముగించి రండి. టిఫిన్ చేద్దాం."

ఆమె స్నానం చేసి వచ్చేసరికి బ్రెడ్, బటర్, జామ్, ఫ్రూట్స్.....డైనింగ్ టేబిల్ మీద అమర్చబడి వున్నాయి.

"ఇదేమిటి?"

"ఏం? మీకు ఇడ్లీ సాంబారు, దోసెలు అలవాటా? మాయింట్లో మొదటి నుంచి యివే అలవాటు. మా ఆవిడక్కూడా నేనే అలవాటు చేసేను".

"అలాగా? నాకసలు ఉదయం టిఫిన్ తినే అలవాటే లేదు. మేం పదింటి లోపలే భోజనం చేస్తాం....సాయంకాలం టిఫిన్. మీరు తీసుకోండి"

"నాకా అదృష్టం లేదు. సుగర్ వాడిని. రెండిడ్లీలు పొద్దునే హోటల్లో తినేసేను. నా కోసం యిప్పటికి తినండి. రేపు సంగతి ఆలోచిద్దాం."

ఆమె టిఫిన్ తింటుంటే అతను తన జబ్బులని గురించి చెప్పేడు.

"నాకు వంట చేయటం చాతకాదు. మధ్యాహ్నం మన భోజనం హోటల్లో. ఈ పూటకి నా మాట కాదనకండి, రేపు సంగతి మళ్ళీ ఆలోచిద్దాం."

ఆయనతో హోటల్‌కెళ్ళి భోజనం చేయడం అన్న ఆలోచన ఆమెకి రుచించలేదు. ఒక్క క్షణం ఆమె గృహిణిగా మారింది.

"వంట యిల్లు ఎక్కడో చెప్పండి. నేను వండుతాను" ఆ మాట అన్న తర్వాత ఆమె నాలిక కరుచుకొంది. అతను అందుకు అంగీకరించడని ఆశించింది.

"అంతకన్నా భాగ్యమేముంది? రండి, కిచెన్ చూపిస్తాను?" ఆ మాటకోసమే వేచి వున్నట్టుగా వెంటనే అని, కిచెన్ వైపు నడిచాడు.

ఆమె వంట చేసేలోగా ఏదో సాకుతో అతను కిచెన్‌లోకి పది సార్లన్నా వచ్చాడు.

వచ్చినప్పుడల్లా తన కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళూ, మనవలు, మనవరాళ్ళని గురించి ఏవో కథలు చెప్తూనే వున్నాడు.

'నా పిల్లలెవరూ నా మాట కాదనరండీ. నేను గనుక గట్టిగా 'యిక్కడే వుండండ్రా' అంటే యిక్కడే వుండిపోయేవారు. కానీ యిక్కడ ఈ దేశంలో మేధావులకు పైకెదిగే స్కోప్ లేదండీ. నా స్వంత అనుభవం వల్ల ఆ సత్యాన్ని తెల్సుకున్నాను. మరి వాళ్ళనిక్కడే వుండమని ఎలా చెప్పను? అంచేత నేనే వారిని ప్రోత్సహించి విదేశాలకు పంపేను. ఒంట్లో శక్తి వున్నప్పుడే, అవకాశం కల్సివచ్చినప్పుడే పుష్కలంగా డబ్బు సంపాదించాలన్నది నా మతం. ఎందుకంటే డబ్బున్న వాడికే సమాజంలో విలువ. బాగా డబ్బు సంపాదించాక నేనే వాళ్ళను రమ్మని రాస్తాను. ఏమంటారు?"

కళ్యాణి ఏమీ అనలేదు. అనాలనిపించలేదు.

"యివాళ నాకింత అదృష్టం పడుతుందనుకో లేదు. యీ యింటి యిల్లాలు పోయాక జిహ్వ మొద్దుబారి పోయింది. మళ్ళీ యివాళ నా జిహ్వకు రుచి అంటే ఏమిటో చూపించారు. నిజం చెప్పాలంటే- మా ఆవిడను మరిపించాను"

తిన్నది తక్కువ, పొగడ్త ఎక్కువ.

ఆ పొగడ్తలు ఆమెకు అపశృతుల్లా వినిపించాయి.

కోడళ్ళు తనని వంట మనిషిగా చూస్తున్నారని బాధపడేది.

మరి యిక్కడికి పయనమై వచ్చింది - ముక్కు మొహం తెలియని ఈ మనిషికి వంట చేసి పెట్టడానికా?

ఈ పొగడ్తలన్నీ తన్ని వుబ్బ కొట్టి వంట మనిషిగా మార్చటానికి కాదుకదా?

"పొగడ్తలొద్దు. ఈ రాత్రికి మీరు వంట చేస్తున్నారు. దగ్గరుండి దర్శకత్వం వహిస్తాను నేను. నా కన్నా మీరు బాగా చేస్తారు."

"నేనా!! నాకు గేస్ స్టౌ వెలిగించటమే రాదండీ బాబూ; నన్ను వదిలేయండి-"

"వదలను-ఎందుకంటే వంట చెయ్యడం కన్నా వంట చేయడం నేర్పడం నాకు యిష్టం. అలా

ఎందరికో నేర్పేను. మీకూ నేర్పుతాను. ఆ తర్వాత వంట వాళ్ళున్నా లేకపోయినా బాధ వుండదు. మీరో పూట, నేనో పూట కిచెన్ వర్క్‌ను షేర్ చేసుకోవచ్చు. స్త్రీలతో పాటు పురుషులు కూడా సమానంగా వుండాలండీ. అలా వున్నపుడే స్త్రీ, పురుషుల మధ్య స్నేహం పెరుగుతుంది. ఏమంటారు?"

"అదంతా అలా వుంచండి, కానీ నేను మాత్రం ఈ వయసులో వంట నేర్చుకోలేను. ప్లీజ్. నన్ను క్షమించండి, రాత్రికి టిఫెన్ కేరియర్ తెప్పిస్తాను". ధృఢంగా అనేసి చర్చకు అవకాశం యివ్వకుండా అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయాడు జగన్నాధం.

★ ★ ★

మర్నాడు నిద్రలేచేసరికి కాఫీ కప్పుతో ప్రత్యక్షమయ్యాడు వంటవాడు. అంత క్రితం రోజు మానేసిన పాత వంటవాడే అతను. అతని పేరు సాంబమూర్తి.

సాంబమూర్తి నోరు విప్పి చచ్చినా మాట్లాడడు. అంతా సౌంజ్ఞల ద్వారానే, అయితే అతను మూగవాడు మాత్రం కాదు. చెవిటి వాడు.

"మా సాంబయ్య నన్ను వదిలి వుండలేడు లేండి. అంచేత మళ్ళీ వచ్చేసేడు. నాకు వంట నేర్చుకునే బాధ, మీకు వంట చేసే బాధ తప్పేయి"

"నాకు వంట చేయడం బాధకాదు, కానీ మీరు వంట నేర్చుకోటం నిరాకరించడమే బాధగా వుంది. మా ఆయన నాకు వంటలో సాయం చేసేవాడు. అవసరమైతే తనే చక్కగా వంటచేసేవాడు. చూడబోతే మన భోజనాన్ని మనం వండుకోటంలోగల ఆనందం, థ్రిల్ మీకుఅనుభవం లేనట్లుంది"

కావాలనే ఆమె తన భర్తను పొగిడింది. అతడిని ఇన్‌డైరెక్టుగా ఎత్తి పొడిచింది. కానీ అతనామె కామెంట్స్‌ను పట్టించుకోలేదు.

మరి కాస్సేపటికి మళ్ళీ గది దగ్గర తయారయ్యాడు.

"నా మనమడు అమెరికా నుంచి ఉత్తరం రాసేడు. ఆ ఆనందాన్ని మీతో పంచుకొందామని........' 'అంటూ మనమడు ఏం రాసిందీ వర్ణించి వర్ణించి చెప్పుకొచ్చాడు. ఆ తర్వాత తన ఫేమిలీ ఆల్బంను చూపించాడు. అందులో ఎవరు ఎవరో మహా ఉత్సాహంగా చెప్పుకు పోసాగేడు.

కళ్యాణికి అతని మాటలు కాస్సేపటికి విన్పించలేదు.

తన వాళ్ళంతా కళ్ళముందు మెదిలేరు

పెద్ద కొడుకు ప్రకాశానికి తనంటే ఎంత ప్రేమ-గౌరవం?

ఎంత పెద్ద హోదాలో వుండి కూడా తన అడుగులకి మడుగులొత్తే వాడు. కోడలితో తన గొడవచూచి ఒకసారి అన్నాడు.

"అమ్మా, వానప్రస్తం స్వీకరించాల్సిన వయసులో నీకు అధికార కాంక్ష ఏమిటమ్మా? నీ కోడలి సైకాలజీ కూడా అర్థం చేసుకోమ్మా"

ఆ మాటలతో తనకు అతను పగ అయ్యాడు.

"అంతే నాయనా-పెళ్ళాం బెల్లం, తల్లి అల్లం అని ఊరికే అన్నారా?" అంటూ తను వాళ్ళ మీద అలిగి వెళ్ళిపోయింది.

చిన్న కొడుకు మాత్రం ఏమన్నాడు కనుక?

"అమ్మా, నీ చిన్న కోడలు ఉద్యోగం చేస్తోంది. తోటి వాళ్ళ మధ్య 'నీట్'గా వుండడం తప్పా? తను మేకప్ ఎలా చేసుకొంటే నీకేం? ఏం డ్రస్ వేసుకొంటే నీకేం? పెద్దవాళ్ళు అలాంటి విషయాలు చూచీ చూడనట్లు పోవాలమ్మా. ఎవరి సరదాలు వాళ్ళవి'

"అంతేలే నాయనా. నువ్విలా నెత్తినెక్కించుకోబట్టే అదలా సినిమా స్టార్‌లా తైతక్క లాడుతోంది. నేనిలాంటి వేషాలు చూడలేను" అంటూ తను వాళ్ళను వదిలేసింది.

"అమ్మా, నీకు రోజు రోజుకీ 'యిగో' మరీ ఎక్కువయిపోతోంది. అన్నయ్యలు ఏం తప్పు అన్నారని వారితో పోట్లాడి వచ్చావ్? మా ఆయనకు పిల్లలకు సేవ చేయడం నాకు ఆనందంగా వుంటుంది. మా యింట్లో ప్రతిదాన్ని తప్పుపడ్తే నేను ఊరుకోను. మాతో కల్సిపోయి వుంటానంటే ఈ ఇంట్లో నీకెన్నాళ్ళయినా స్థానం వుంటుంది." కూతురు

"అంటే నీకూ నీ పిల్లలకీ సేవ చేస్తూ వుండాలనా నీ ఉద్దేశ్యం? అంత గతి నాకేం పట్టలేదు. తిండి కోసం మీ మోచేతి నీళ్ళు తాగాల్సిన పని నాకేం లేదు. నా తోవన నేను హాయిగా బ్రతకగలను?"

యిప్పుడాలోచిస్తే కొడుకులు కూతురు అన్నదాంట్లో తప్పేముందనిపించిందామెకు.

తను దూరం చేసుకొంది కానీ తనకు మాత్రం మనవళ్ళు, మనవరాళ్ళు లేరా! వాళ్ళు తనకి ఉత్తరాలు రాయరా? తను వెళ్తే 'అమ్మమ్మా అమ్మమ్మా, నానమ్మా, నానమ్మా' అంటూ దగ్గరికొచ్చి కౌగిలించుకోరా? ముద్దులివ్వరా?

"ఏమండీ, నా మాటలు మీరు వినడం లేదు. అవునా? అయినా మీరు వచ్చిందగ్గరి నుంచి నా వాళ్ళను గురించే చెప్పేనుగానీ మీ వాళ్ళని గురించి అడగలేదు కదూ? యిప్పుడు యిక మీరు చెప్పండి, నేను వింటాను"

"చెప్పడానికేమీ లేదు. ప్లీజ్. నన్ను వదిలేయండి కాస్సేపు"

"మీ వాళ్ళను తల్చుకొని బాధపడ్తున్నట్టున్నారు. వాళ్ళను మర్చిపోండి. నేనున్నానుగా? మీకేం భయం లేదు. కాస్సేపు విశ్రాంతి తీసుకోండి" అతని వోదార్పు ఆమె గుండెల్లో బల్లెంలా గుచ్చుకుంది.

★ ★ ★

మర్నాడు జగన్నాథం ధోరణి హఠాత్తుగా మారింది. ఏక వచన ప్రయోగంలోకి దిగేడు.

"కళ్యాణీ, సృష్టిలో ప్రేమ అనే పదార్థం ఎంత మధురమైనదో నాకిప్పుడు తెల్సివచ్చింది. ఒకసారి ప్రేమించిన వస్తువునే వదులుకోలేడు మనిషి. తను ప్రేమించిన వ్యక్తి సాహచర్యం కోసం తపించిపోతాడు.

నిన్నిలా యింట్లో చూస్తుంటే నాకు జగత్తునంతా జయించినంత ఆనందంగా, గర్వంగా వుంది కళ్యాణీ....'

అతని భావాలు, భాష, చూపుల్లో కూడా ఏదో వేడి....

ఆమె మనసులో ఏవేవో భయాలు...అనుమానాలు

"ఇరవై ఏళ్ల యువతిని పెళ్ళి చేసుకొన్న ఎనభై ఏళ్ళ పెళ్ళికొడుకు"

"పాతిక మంది మనవలు, మునిమనులు, మనవరాళ్ళు వుండి, సంవత్సరం క్రితం పాతికేళ్ళ పిల్లను అయిదో పెళ్ళి చేసుకున్న తాతయ్యకు కవల పిల్లలు...."

వింతలు కావవి. వార్తలు. యదార్ధ వార్తలు. ఎన్నో?

"కల్యాణీ-నాదో చిన్న కోరిక. నోనో. ప్రపోజల్. చెప్పనా?" ఆ సాయంకాలం అన్నాడతను.

"చెప్పండి"

"మనం చిన్నప్పటి ప్రేమికులం. తోడుకోసం వృద్ధాప్యంలో కలిసేం. రెండు రోజులుగా వొకేయింట్లో వుంటున్నాం. కానీ వేరువేరు గదుల్లో పడుకొంటున్నాం. మనం వొకే గదిలో పడుకొంటే మాత్రం తప్పేమిటి?"

"పడుకోక పోతే వచ్చిన నష్టం ఏమిటి?"

ఆమె మాటల్లో ఘాటుకు జగన్నాథం మొహం పాలిపోయింది.

"ఏం లేదు. నా కోరిక. జస్ట్ ప్రపోజల్ అని చెప్పేను గదా? నన్నపార్థం చేసుకోకు - ప్లీజ్...."

అతను వెళ్ళగానే ఆమె ఫోన్ ఎత్తి వొక నెంబర్ రింగ్ చేసింది.

✯ ✯ ✯

"ఇదేంటి అమ్మమ్మా - మూడురోజులకే హడావుడిగా విమానంలో ఎగిరి వచ్చావేమిటి? నీ నుంచి ఫోన్ రాగానే నాకు మతి పోయిందనుకో - అక్కడ...."

"అక్కడ సంగతి వదిలెయ్యవే దీపా. అసలు మన ఆలోచనా ధోరణిలోనే ఎక్కడో తప్పువుంది. ఆ తప్పు దిద్దుకోటానికే ఆ పెద్దమనిషితో చెప్పనన్నా చెప్పకుండా పారిపోయి వచ్చాను"

"అయితే తిరుగుబాటు చేయడం తప్పంటావా?"

"ఊహు - అయితే ఏ లక్ష్య సాధనకు? అదీ సమస్య. మన లక్ష్యం సక్రమమైనది కాదు. అసహజమైనది. అవాస్తవికమైనది. నీ ఆలోచన తప్పని చెప్పాల్సిన దాన్ని, అహంకారంతో నేను తప్పుచేసేను"

"అమ్మమ్మా యిలా మారి పోయావేమిటి?"

"వాస్తవాలు తెల్సుకొన్నానే. సత్యాలు గ్రహించాను. వృద్ధాప్యంలో మనిషికి అండగా నిల్చేది చిన్నప్పటి విఫల ప్రేమలు కాదు. మమతాను బంధాలు! ఆ మనిషి - అదే ఆ జగన్నాథానికి - అమెరికాలో

వున్న తన వారంటే ఎంత ప్రేమో! వాళ్ళను తల్చుకొని ఎంత గర్విస్తాడో! మరి నేను నా వాళ్ళ నెందుకు వదులుకోవాలే? ఆ మమతాను బంధాల కోసం ఈ వయసులో నా కోరికల్నీ అహంకారాన్నీ కాస్త చంపుకొంటే తప్పేమిటి! ఆ మగాడికి నాతోడు కావాలి. ఎందుకో తెల్సా! ఆయన తన వాళ్ళను గురించి చెప్పే కథలు వినడానికి. అన్నం వండి పెట్టటానికి. యిల్లు సర్దటానికి, పక్కలో పడుకోటానికి. ఆయనకు పెళ్ళాం లేని లోటు తీర్చటానికి. నాకేం గతి పట్టిందే? ప్రేమ బంధం, స్నేహ బంధం... ఇవన్నీ ఆచరణలోకి రాని తియ్యటి భావనలు. ఎన్నేళ్ళోచ్చినా పురుషుడికి భార్య కావాలే. భార్యయిచ్చే సుఖాలు కావాలి. అక్కడే స్త్రీ, పురుషుల శారీరక మానసిక తత్వంలో పెద్ద భేదం వుంది. ఈ భేదాన్ని గుర్తించకపోతే స్త్రీ వృద్ధాప్యంలోకూడా మోసపోతూవుంటుంది."

"అదంతా అలా వుంచు అమ్మమ్మా - కానీ నీవు అనుకొంటున్నట్టు జగన్నాథంగారికి తన వాళ్ళంటే ప్రేమ లేదు. బ్రతికి వుండగానే భార్యంటే ఆయనకి ప్రేమ వుండేది కాదు. అందుకు కారణం నీపట్ల చిన్నప్పుడు ఏర్పడిన ప్రేమే. భార్య పోగానే పిల్లలంతా ఆయన్ని వదిలేసి వెళ్ళిపోయారు. ఆయన వాళ్ళ దగ్గరికెళ్తే అవమానించారు. అందుకనే ఆయనకు వారంటే కోపం, ద్వేషం, అసహ్యం.... ఈ స్థితిలో నువ్వాయనకు చెప్పకుండా వచ్చేసేవంటే - ఆయన గుండె ఆ షాక్‌ని భరించలేదు. అసలే ఆయన బీపి పెషెంట్"

"కానీ ఆయన తన వాళ్ళను పొగుడుకుంటూనే వున్నాడే!"

"అందుకు కారణం నాకు తెలియదు, కానీ నేను చెప్పింది మాత్రం యదార్థం... మనం యింటికెళ్ళి ఆయనకు ఫోను చేయాలి"

"నీకు తెలియని ఆ కారణం నాకిప్పుడే తెల్సింది దీపా. నేను చాలా మంచిపని చేసేనని యిప్పుడే ధృవపడింది. ద్వేషించే తనవారినికూడా ఆయన అంతరంగంలో ప్రేమిస్తున్నాడు. మరి నన్ను ప్రేమించే నా వారిని నేనెందుకు ద్వేషించాలి? కొట్టుకున్నా, తిట్టుకున్నా నావాళ్ళ మధ్యన నాకు ఆనందం, తృప్తి-

దోవ పొడుగునా మనసులో అనుకొంటూనే వుంది. అలా అనుకొనే కొద్దీ అనందం - తృప్తి!

టాక్సీయింటి ముందాగింది. అంతా కళ్యాణిని, ఆదరంగా రిసీవ్ చేసుకొన్నారు.

ఫోను రింగయింది.

"ఫోన్ నీకే అమ్మమ్మా - జగన్నాథంగారు"

ఫోను తీసుకొంది కళ్యాణి

"కళ్యాణిగారూ నన్ను క్షమించండి. మిమ్మల్ని అర్థం చేసుకోలేక ఓవర్ ఏక్షన్ చేసేను. దొరికిన కాస్త తోడునూ చేతులారా జారవిడుచుకున్నాను. అయాం ఏ ఫూల్ - ఇడియట్, మంచి నిర్ణయం తీసుకొన్న మిమ్మల్ని మనసారా అభినందిస్తున్నాను. విష్‌యూ ఆల్ ది బెస్ట్ అమిస్ట్ యువర్ నియర్ అండ్ డియర్

కళ్యాణి కామ్‌గా ఫోన్ పెట్టేసింది!

(1986లో ఆరణి' రాసిన కథ 'పయనించే వో చిలుక' కథ ఎండింగ్ ఈ కథకు బిగినింగ్)

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1992 దీపావళి ప్రత్యేక సంచిక